# పిక్ నిక్.

స్నానమూ, హోటల్ భోజనమూ అయినై. పండు వెన్నెల్లో మల్లెపందిరికి దగ్గరగా వాలుకుర్చీలో కూచుని తేలిగ్గా జారిపోతున్న చల్లగాలి అనుభవిస్తో వూహలు రేకెత్తించే ఆకాశంవంక చూస్తూ, మేఘాలు వర్షించేందుకు నా 'కంట్రిబ్యూషను'గా సిగరెట్టుపొగ ఆకాశంపైపు వదులుతున్నాను. హృద్వీణలో, ఏవోతంత్రుల్ని మోగిస్తూ, ఏవో ఏవో భగ్నకలశాలని జ్ఞప్తికితెస్తూ కమ్మటి బాధలు కల్పించే ఆ అవంతాకాశంవంక చూస్తూవుంటే మానవుడి అసహాయతా, అల్పత్వమూ కళ్ళకి కట్టినట్టుగా కన్పిస్తాయి. నశించిపోయే కాయం సంపాయించుకోకలిగిన నేత్రద్వయంతో చూస్తూ వయస్సుముదిరినకొద్దీ "సినికల్"గా తయారయే మెదడుతో ఆలోచిస్తున్నాను.

ఎల్లుండి కట్టవలసిన యిన్స్యూరెన్సు ప్రీమియమూ, వారంలోపుగా చెల్లించవలసిన యింటిపన్నూ, అయ్యరు కాతా బాకీ, భార్యకి రాయవలసిన వుత్తరమూ, స్కాండులూ, పేకాట—ఇత్యాదులన్నీ మర్చిపోయి, యీ ప్రపంచపుగాలులు సోకని మరోప్రపంచంలో కేరింతాలుకొడుతూన్నా.

"ఎన్నసార్, మెడిటేషన్ ?"

చూశాను. మరోప్రపంచంలోంచి మామూలు ప్రపంచం లోనికి వచ్చాను. మీనాక్షి సుందరం అయ్యరుగారు వేంచేశారు. కాళీగావున్న రెండుకుర్చీలలోనూ ఒకటి తమదిగ చేసుకున్నారు. వారు మిత్రులు, యోగ్యులు. చక్కటి జుట్టు ముడికలవారు. వారికి బ్యాంకులో వుద్యోగం. వారి జన్మ స్థానం కుంభకోణానికి ధగ్గరగావున్న ఒకగ్రామం.

"సాపాటు అయిందా అయ్యరుగారూ ?"

"అయివుండింది సార్, అయివుండింది."

"ఏడండీ, గిరిఏడీ ?"

"అతనుద స్టార్టుఅయి— అక్కడద....ఎవరోఅబ్బా.... బాతాఖానీ...."

అయ్యరుగారికి సరిగ్గా తెలుగురాదు. అమ్మమ్మ వత్తుల పెట్టిలోంచి అణాదొంగతనంచేసిన మనమడైనా తనచోరీ ఒప్పుకుంటాడేకాని, వీరుమాత్రం తమకు తెలుగురాదనే విషయం వొప్పుకోరు. భాషతో ఏదో ఒకరకంగా కుస్తీ పట్టి తెలుగులోనే మాట్లాడేమని అనిపించుకుంటారు.

"ఏమండీ, మీకు తెలుగురానిపక్షంలో యింగ్లీషులోనే ఎందుకు మాట్లాడకూడదండి,—మాభాషని యిలా ఖూనీ చెయ్యకపోతే..."

"అభ్యాసంద అవవలె సార్....బేబీ....తప్పటడుగులద వేసి...అపరం....సరిద నడచును."

"హల్లో!" అన్నాడు గిరి వీధిలోనుంచి.

"మిస్టర్ గిరి వరువాం, సార్."

"వెన్నెల ఫస్టుగావుంది బ్రదర్. పేకాటకి భేషుగ్గావుంది. వెన్నెట్లో పేకాడుకోవాలని నా కెన్నాళ్ళనుంచోసరదా."

గిరి తన్ను ఆహ్వానిస్తున్న కుర్చీని ఆక్రమించాడు.

గిరినికూడా యీవెన్నెల యింప్రెస్ చెయ్యగలగడం నేను స్టడీచెయ్యవలసిన విషయాలలో ఒకటి. స్వతహాగా. కవిత్వపుసరుకు అతన్ని వుత్సాహపరచలేదు సరిగదా చీకాకు పరుస్తుంది. మిట్టమధ్యాహ్నం, ఈచెవి గాలుపు ఆచెవికికొడుతూవుండేవేళ తనకి నిద్రాభంగంకలిగించడమే నిమిత్తంగా పెట్టుకున్నదా అని భావింపచేసేట్టుఅరిచే కోయిలగోల అతనికి గిట్టదు. ఆ వెధవ అరుపుడుపిట్టని అంత గొప్పగాపొగిడి, పాడిన కళారాధకులమీద అతనికి అట్టే గౌరవంలేదు. అలాటిగిరి మనస్సునికూడా కదిలింప గలిగేశక్తి యీ వసంతకాలపు వెన్నెట్లో వుందన్నమాట!!

"కార్డ్సు ఎక్కడవున్నాయి?" అని గిరి అడిగాడు.

చెప్పబోతూవుండగా గిరి అన్నాడు "వెంకట్రావు ఆదివారం ఒకపిక్నిక్ ఏర్పాటుచేస్తానన్నాడు. మనమందరమూ ....మీరు కూడాను....అయ్యరుగారూ.... పిక్నిక్నే మన వాళ్లు వనభోజనమనీ, వనసంతర్పణఅనీ అనేవారు. నాకిలాటివి యిష్టంలేదు. ఈదురుగాలికి చెత్తాచెదారమూ ఒకమూల

వి స్తట్లో పడుతూవుండగా, యింకోమూలనించి దులుపు కుంటూ....ఎందుకీ రభసా, క్షోభానూ ?" అంటూ గిరి తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"రొంబ ఎంజాయ్‌మెంట్, సార్ !"

"ప్రోగ్రాంచెప్పు" అన్నాను గిరితో.

"ఉదయం అయ్యరుహోటల్లో.... 'సారీ' అయ్యరు గారూ!....అయ్యరు హోటల్ అంటే మీరు అన్యథా అనుకో వద్దు. ఆంధ్రదేశంలో మాకు కాఫీహోటల్‌కి బదులుగా అయ్యరుహోటల్ అనడం అలవాటైపోయింది. నాలుగేసి యిడ్డెన్లూ, కప్పు కప్పు కాఫీ సేవించి, ఒక ఒంటెద్దుబండి మీద భోజనానికీ, టిఫిన్‌కీ వలయు సాధనసామగ్రిఎక్కించి, యీ వూరికి దక్షిణంగా సుమారు మూడుమైళ్లదూరంలో వున్న వెంకమ్మగారితోట అనబడే సుబ్బమ్మగారి మామిడి తోటకి వెళ్ళడం...."

"వంట బ్రాహ్మణ్ణి మాట్లాడారా ?" అని అడిగాను.

"నువ్వూ అదేఅడిగావ్ ! వంటబ్రాహ్మడువుంటే చాలా శోభస్కరంగావుంటుంది; వాడు ఒకపక్కనుంచి వండుతూ వుంటాడు. మనం యింకోపక్కనుంచి పేకాడుకుంటూ తింటూవుండొచ్చు—అని నేను వాదించాను. వెంకట్రావు వొప్పుకోలేదే. పిక్‌నిక్‌లో వంట పార్టీసభ్యులే చేసుకోవా లన్నాడు. లేకపోతే పిక్‌నిక్ కళావుండదట. అందమే

వుండదట. తను చప్పబడ్డా శేఖరమూ, సోమసుందరమూ ససేమిరా అంటారన్నాడు."

"మనంద 'కుక్' చేసుకొనడం బెస్టు సార్" అంటూ అయ్యరుగారు అందిచ్చారు.

'నలుగురితో నారాయణ' అంటూ మేం ముగ్గురం పేకాటలో కూచున్నాం.

గిరి వెళ్తున్నప్పుడు చెప్పాను. 'రెండు కొత్త పేకలు కూడా కావాలి పిక్‌నిక్‌కి.'

"అది మనకి తెలియదటోయ్!" అన్నాడు గిరి.

ఫొళుక్కున నవ్వారు అయ్యరుగారు.

* * *

మాలో-అయ్యరుగారు మినహా—అందరూ ఎనిమిదో తారీఖువరకు మహారాజులూ, ఆపైన దివాలాకోర్లూ. మా అందరికీ పెట్టుబడిదారు—మీకు తెలుసుకదూ— వెంకట్రావు. కావలసినదంతా వడ్డీలేకుండానే పెట్టుబడి పెడతాడు. రెండో తారీఖువుదయం కాబూల్‌సాయిబులావచ్చి వసూలుచేసుకుపోతాడు.

ఉదయం ఏడున్నరకి బయలుదేరవలసినపార్టీ వూరు పొలిమేరదగ్గరికి వచ్చేటప్పటికి తొమ్మిదిన్నర అయింది."

"మనం ఏమీమర్చిపోలేదుకదూ! పేకలు వున్నాయీ?" అన్నాడు గిరి.

ఉన్నాయన్నాడు సోమసుందరం.

"ఏమైనా మర్చిపోతే పూళ్ళోకి త్వరితంగా వెళ్ళగలిగేం దుకు ఒక సైకిలుకూడా తీసుకువచ్చివుంటే బావుండేది." అని శేఖరం అభిప్రాయం.

"తమరుద ఏమిశలవిస్తురు ?" తెలుసుకుందామనే కుతూహలంతో అయ్యరుమహానుభావుడు అడిగాడు.

"తమవిషయం కాదు" అన్నాడు శేఖరం. ఆయన్ని చిన్నబుచ్చాలనే ఉద్దేశ్యంతో.

శేఖరానికి అరవలంటే అసహ్యం. గిరికి ఆంధ్రులంటే అసహ్యం. సుందరానికి తన భార్యఅంటే అసహ్యం. నాకు ఆహ్వానించి నిరుత్సాహపరచే ఆడవాళ్లంటే అసహ్యం. వెంకట్రావుకి ఖర్చుచెయ్యడమంటే అసహ్యం. అయ్యరు గారికి (తరవాత తెలిసింది) హిందూస్తానీ సంగీతమంటే అసహ్యం.

గిరి : "బ్రదర్ ! సిగరెట్ ! సిగరెట్ !"

నేను : వెంకట్రావ్ !

సిగరెట్ అన్నాడతను.

సిగరెట్ ....సిగరెట్ ....సిగరెట్ ....

బండి నడిరోడ్డులోఆపి సిగరెట్ టిన్నుకోసం బండి అంతా గాలించాం. యీలోగా ఓవర్‌లోడ్ చేసుకువస్తున్న ఒక బస్సుడ్రైవరు బండివాడిమీద తన ఆధిక్యత 'క్లయిమ్'

చేశాడు. బూరా నాలుగుసార్లు వూదడమూ, ఎద్దు మరబళ్లు నడిచేరోడ్డుని నడవడానికి యిష్టపడక రుప్పలలోకి పారి పోవడమూ, మమ్మల్నందరినీ తేరిపారిచూస్తున్న పాసింజర్లతో ఆ బస్సు తుర్రుమనడమూ, బండిలోనుంచి ఒక బిందె కిందికి జారి సొట్టలుపడడమూ—ఈవుపద్రవమంతా కన్నుమూసి తెరిచేలోపల జరిగిందంటే నమ్మండి నమ్మక పొండి.

రుప్పలలోంచి రానని మారాముచేస్తున్న ఎద్దుని మందలించి మాలాటి యోధానుయోధులు వెంటనడుస్తూవుండగా ఎట్టిప్రమాదమూ సంభవించడానికి తగిన అవకాశంలేదని రాజకీయదురంధరులు యిచ్చేగ్యారంటీలాటిది ఒకటి దాని మొహానపారేసి, రోడ్డుమీదికి ఎక్కించేటప్పటికి మాపెద్దలు దిగివచ్చారు.

రోడ్డుమీదికి రాగానే ఎద్దు తనకీ, తనబండికీచేసిన అపచారానికి ప్రతిఫలమా అన్నట్టు దానితోక మెలిపెట్టాడు. అది రివ్వున గంతేసింది.

పరిగెత్తడంలో చూపిస్తున్న ఆ ఎద్దుకోపాన్ని అభినందిస్తున్నవాడిలా సోమసుందరం అన్నాడు: ఎద్దులుకూడా బాగా పరుగెత్తగలవ్—అని.

ఎవరికికావాలి అతని చచ్చుఅభిప్రాయం?

నాలుగు నిమిషాలలుంచీ మర్చిపోయిన విషయాన్ని గిరి జ్ఞాపకంచేశాడు "సిగరెట్, బ్రదర్స్" అంటూ.

బండిలో యింకోదఫా వెతకాలని సోమసుందరం.

అఖ్కర్లేదని శేఖరం.

ఇద్దరూ యుద్ధం డిక్లేర్ చేసేంతవరకూ వచ్చిందిపరిస్థితి.

ఇంతమంది ఆంధ్రుల్లో తను ఒక్కణ్ణీ అయిపోయాను కదా అన్నట్లుగావున్న అయ్యరుగారు వూరుకుని వూరుకుని మాట్లాడారు.

"మనంద సిగరెట్ తెచ్చిందిలేదు. అక్కడద మర చితిమి."

అయ్యరుగారు తనమాటే పలుకుతున్నా వినిపించుకోకుండా "మీకుద అడిగిందిలేదు." అన్నాడు శేఖరం కయ్యానికి కాలుదువ్వుతూ.

"ఎక్స్క్యూజ్ మి, సార్" అన్నారు అయ్యరుగారు ముందుకునడుస్తూ.

సుందరమూ శేఖరమూ కుస్తీపట్టేందుకు సిద్ధంగా వున్నారు. నేనూ, గిరీ పిక్నిక్ మాట దేవుడెరుగునుకాని, సాయంత్రందాకా సిగరెట్లులేకుండా జీవించడం దుర్లభమనుకుంటున్నాం.

"ఫైనల్ సెర్చి అయినతరువాత వూళ్ళోకి వెళ్ళడం మంచిది." అని వెంకట్రావు నసుగుతూ తన అభిప్రాయం వెళ్ళగక్కాడు.

బండికీ మాకూ రెండుఫర్లాంగుల దూరంవుంది.

హైస్కూలులోనూ, కాలేజీలోనూ రన్నింగురేసులో మొదటి బహుమానం ఎవరికివచ్చిందనే విషయంమీద కాసేపు చర్చజరిగింది. క్లబ్బులోగానీ పేకాటలోగాని పడక కుర్చీలోకూచున్నప్పుడుగానీఇలాటిప్రసక్తివస్తే మొదటిబహుమానం తనదేఅని ప్రతీవాడూ 'క్లయిమ్' చేసేవాడే! కాని యిప్పుడందరూ 'నన్నుముట్టుకోకు నామాలకాకీ' అన్నట్టు వూరుకున్నారు.

ఆదర్శాలవల్లకలిగే అగచాట్లు అనుభవిస్తూ, ఆదర్శాల కోసమే పాటుపడే యీ రచయిత బండివేపు పరుగెత్తాడు.

"రొంబ గుడ్ ఫ్రెండ్" అని అయ్యరుగారు ప్రశంసించడం వినిపించింది.

## II

మొట్టమొదట సిగరెట్టూ, సైకిలూ మర్చిపోవడమూ.... తర్వాత సబ్బుబిళ్లా, తువ్వాళ్ళూ మర్చిపోవడమూ.... తదుపరి తమలపాకులూ వగైరా మర్చిపోవడమూ.... మర్చిపోయినవాటిని తీసుకువచ్చేందుకు ఒక్కొక్కరే వంతు ప్రకారం వెళ్ళారు. అయ్యరుగారికి వంతురాలేదు. ఆయనకి సైకిలుతొక్కడంకూడారాదు.

అన్నీ సేకరించుకుని ఒకచోట గుమిగూడి, పాకశాస్త్రోపాధ్యాయుడైన అయ్యరుగారి సలహాపుచ్చుకుంటూ సోమసుందరం వంటపనికి వుపక్రమించాడు.

వంకాయకూర—సెనగపప్పు పచ్చడి—బంగాళాదుంపలూ వుల్లిపాయలూకలసిన కూర— సాంబారు— చారు— అరవ అప్పడాలు— తెలుగు వడియాలు— రవ్వలడ్లూ— పులిహోర— క్షీరాన్నం—ఇవీ వంటకాలు.

పాకశాస్త్రంలో ఏమాత్రం అనుభవంలేని నేనూ, భార్య 'కాజుయల్‌లీవు' పుచ్చుకున్నప్పుడుమాత్రమే చేతులు కాల్చుకునే శేఖరమూ, క్షీరాన్నంలో వుప్పుతక్కువైందంటే విశ్వసించే వెంకట్రావూ అంతో యింతో సాయపడ్డాం. గిరి పైపైన వుండి హడావుడి చేసేవాడు.

బండివాడు సాయంత్రందాకా మాతోనే వుండేటట్టూ, వాడికి కడుపునిండా అన్నంపెట్టి ఎనిమిదణాలు యిచ్చేటట్టూ, మాకుకావలసిన పైపనంతా వాడు చూడగలందులకు ఏర్పాటుచేసుకున్నాం. ఈ బండివాణ్ణి వంటజరుగుతున్న ప్రదేశంలోకి రానివ్వడమా రానివ్వకపోవడమా అనేవిషయం చర్చకిగాను అయ్యరుగారు ప్రవేశపెట్టారు. రానివ్వకూడదనీ, పొయ్యకిచుట్టూ తెరఅయినా కట్టకపోతే బ్రాహ్మణధర్మం ఆనాటితో బంగాళాఖాతంలో కలిసిపోతుందనీ వారు గొడవచేశారు. కాని, వారు వోడిపోయారని చెప్పేందుకు నేను విచారించడంలేదు. మాలో ఏఒక్కరం ఖద్దరుకట్టకపోయినా, దంపుడుబియ్యం తినకపోయినా గాంధీగారిని వుదహరిస్తూ హరిజనులనేపేరు సంపాయించుకున్న పంచ

ములకే ఆమహాత్ముడు దేవాలయప్రవేశార్హత కలిగించగా. నాలగవజాతికిమాత్రమే చెందిన యీ అభాగ్యపు బండివాని విషయంలో యిట్టిఅనాదరణ మానవజాతికి మాయనిమచ్చ అని అయ్యరుగారు తలవంచుకునేటట్లు మాట్లాడాం.

పాపం అయ్యరుగారు ఒక్కరూ అయిపోయారు. ఏం చేస్తారు ? అయినా ఆయన తనఓటమిని ఎక్కువగా పరిగణించి అంతగా బాధపడలేదు.

ఉత్సాహంతో అన్నాడు : "మీదిద మెజారిటీ, మేముద ఒకణ్ణివుంటిమి" అని భొళుక్కున నవ్వారు.

శేఖరం పళ్లు పటపట కొరికాడు. అయ్యరుగారి పాలసీ శేఖరం స్వభావానికి విరుద్ధమైనది.

"భోంచేస్తున్నప్పుడుమాత్రం వాడు మనకి ఎదురుగా వుండడులెండి." అని బండివాడివిషయమై అయ్యరుగారికి గ్యారంటీయిచ్చాడు వెంకట్రావు.

ఒంటిగంటన్నర అయింది. ఉదయంనుంచీ ఏపనీముట్టుకోక కబుర్లతో మమ్మల్ని బుజ్జగిస్తున్న గిరిని వంటదగ్గర కాపలావుంచి మేము దగ్గరలోనేవున్న చెరువుకి స్నానానికి వెళ్ళాం.

మేము ముందువస్తున్నాం. తాము సంధ్యవార్చుకు వెనక వస్తామనీ వడ్డన ఆరంభించవచ్చుననీ తమకేమీ అభ్యంతరం లేదనీ అయ్యరుగారన్నారు.

మేము వచ్చేటప్పటికి దృశ్యం అద్భుతంగావుంది. మా కెదురుగావున్న గిరి సిగరెట్ పీలుస్తూ, 'బేట్రాయి సామి దేముడా' అని కూనిరాగాలుతీస్తూ, పేషన్సు ఆడుకుంటు న్నాడు. అతనివెనక వంటలున్నాయి. ఒక శునకరాజం మాకు అతిధిగావచ్చి వంకాయకూరలో పాళ్లు సరిపడ్డాయో లేదో అని వాసనచూస్తోంది.

"అదేమిటి గిరీ ?" అన్నాడు వెంకట్రావు.

"What man ?" అన్నాడు గిరి వుషారుగా.

"వెనక...."

పేకముక్కలు కిందపడేసి వెనక్కితిరిగాడు గిరి. తారా జువ్వలాలేచి, 'డామిట్, నిన్ను మూడుసార్లు డిస్మిస్ చేస్తే మళ్ళీవచ్చావా ?' అంటూ దాన్ని కొట్టేందుకు ఆయుధంఏమీ అందుబాటులో కనిపించక, చేతిలోవున్న సిగరెట్ విసి రాడు. ఆ సిగరెట్ వంకాయకూరలో పడింది.

వెంకట్రావు గిరిని కూకలేశాడు. గిరిఅన్నాడుగదా, నా స్థితిలోవుంటే నువ్వూ అంతేచేస్తావు—అని.

చెయ్యనన్నాడు వెంకట్రావు.

చేస్తావన్నాడు గిరి.

యీలోగా కుక్కని అరమైలుదూరందాకా తరిమిన శేఖరం చెమటలుకక్కుతూ వచ్చాడు.

నేను వంకాయకూరలోపడ్డ సిగరెట్ తీసి అవతల పారే శాను.

చిన్నసైజుపర్వతంలో కదలిక కలిగిందా అనేభావాన్ని స్ఫురింపచేస్తున్నట్టుగా అయ్యరుగారు రావడం గమనించి, వెంకట్రావు 'Silence please' వార్నింగు మాకు యిచ్చాడు. జరిగిన రెండువుపద్రవాలలో ఏఒక్కటి ఆయన చెవినిపడ్డా—పాపం, అంతశ్రమపడ్డ బ్రాహ్మడూ—భోజనానికి నీళ్లువదులుకుంటాడేమోఅని మాఅందరికీ దుడుకుగా వుంది. శేఖరం అయ్యరుగారినిగురించి జాలిపడడం అదే మొదటిసారి.

అంచేత... గప్‌చిప్.... పదార్థాలేవేవి, ఎంతరుచిగా వున్నాయనే విషయంమీద విపులంగారాస్తే, మీరు నాకధ లింక చదవకూడదనుకుంటారు. అంచేత, సూక్ష్మంగా చెప్తాను.

వంకాయకూర బాగానేవుందికాని వుప్పువెయ్యడంలో పొరబాటుజరిగింది. సోమసుందరానికి తెలీకుండా అయ్యరుగారూ, అయ్యరుగారికి తెలీకుండా సోమసుందరం వేశారు. అంచేత వంకాయకూరలో ఉప్పు 'డబుల్‌డోస్' లోవుంది.

సెనగపప్పు పచ్చడి (అయ్యరుగారికి కోపంవస్తుందేమో!.... చెట్నీ అంటాను) సాంబారూ, అయ్యరుగారి Direct supervision లో తయారయ్యాయి: అమోఘంగా వున్నాయి.

బంగాళాదుంపలకూరలో కారం ఎక్కువైందని కొందరమూ, ఉప్పుతక్కువైతే అలాంటిరుచేవస్తుందని కొంద

రమూ వాదించుకొన్నాం. ఈ విషయమై ఒక నిర్ణయానికి రాలేకపోయాం.

రసంలో వుప్పువెయ్యడం మర్చిపోయారు. దీనిగురించి చర్చ జరుపగా ఏంతేలిందంటే: సోమసుందరం చారులో (కాదండీ, అయ్యరుగారూ, రసం) వెయ్యవలసిన లవణం వంకాయకూరలో వేశాడట.

మహాయుద్ధంజరుగుతున్న సమయంలో తమకేంసంబంధంలేనట్లుగా ప్రవర్తించే తటస్థరాజ్యాలమాదిరిగా వుండే రుచీ పచీలేని అరవఅప్పడాలు మేము తినాలనే దుర్బుద్ధితో తెప్పించడం వెంకట్రావులోపం.

రవ్వలడ్లు లడ్డూస్వరూపంలోవుండడానికి అంగీకరించలేదు.

క్షీరాన్నమూ, పులిహోరా మాంఛి రుచిగావున్నాయి.

వడియాలవిషయం చెప్పలేదుకాదూ? అవి వేయించడం మర్చిపోయాం.

అందరమూ పూటుగాతిన్నాం. వరదలలో నది గట్లను రాచుకుపోతూంటే ఎంత నిండుగావుంటుందో మా జీర్ణకోశాలు అంత నిండుగావున్నాయి. బండివాణ్ణి తనపని కానివ్వమన్నాం.

"ఏంబాబూ, యింతలేసి మిగిలిపోయాయేమిటండీ?", అన్నాడు వాడు. "తిను, నిండాతిను." అన్నారు అయ్యరుగారు.

తమలపాకులు సేవించడం—సిగరెట్లు అంటించడం—విశ్రాంతి—పేకాట—అయిదింటికి టీ.

"అయ్యరుగారూ, మీకు సంగీతంలో ప్రవేశంవుంది. మంచి కృషికూడా చేసినట్టు కనిపిస్తున్నారు. సంగీతం లేకుండా పిక్‌నిక్‌కి పరిపూర్ణత కలగదు. ఒక్క..." అందిచ్చాడు వెంకట్రావు.

"అరవసంగీతం నేను సహించను," అంటూ శేఖరం ప్రొటెస్టు.

"సంగీతంలో తమిళాంధ్ర భేదంలేదు" అన్నాను, వుందోలేదో నాకు తెలీదుకాని.

అయ్యరుగారు మొదలెట్టారు ఆలాపన.

"తొలినేను జే....సిన పూజా...."

శేఖరం ఆందోళన లేవదీశాడు. యిలాంటి అర్థంలేని అరుపులూ, క్రమంలేని పదాలూ, పాటలోవుండే భావాన్ని తారుమారుచేసే రాగాలూ సంగీతం కానేరవన్నాడు.

హిందూస్తానీమట్లూ, పార్శీమట్లూ, సినీమాలలోపాడే 'ప్యారీ....ప్యారీ' పాటలూ శాస్త్రయుక్తమైన సంగీతంలో చేరవని అయ్యరుగారి వాదం.

యిద్దరూ మళ్ళీ 'నువ్వంటే నువ్వు' అనుకునేదాకా వచ్చారు.

"మనస్సుకి వుల్లాసాన్ని కలిగించి. ఆకాశవీధుల్లోకి తీసుకుపోగలిగిన ప్రతీది సంగీతమే" అన్నాను నేను.

"There you are?" అన్నాడు శేఖరం.

వెంకట్రావు అయ్యరుగారిని ఆరంభించమన్నాడు. ఆయన మళ్లీ, "తొలినేను జే...."అంటూ అందుకున్నారు. చిట్టిస్వరమూ వగైరాలు ఆయనచెప్పినశాస్త్రంలో భేషుగ్గానే పాడివుంటారు. కాని శేఖరంవెక్కిరింపులో ఆకృతిలోనూ, ఆయన గాత్రంలోనూవున్న కొద్దిపాటి అందమూ జారిపో యింది. పాట పూర్తి అవడమే తడవుగా బయలుదేరదా మని లేచాం.

అయ్యరుగారికి యింకోరెండుకృతులు వినిపించాలనే వుందిగాని వినేందుకు వోపిక వెంకట్రావులోవున్నా మిగి లిన మాలోలేదు.

అలుస్తు పొలుస్తు—పులిహోరవల్లకలిగిన దాహం తీర్చు కునేందుకు గ్లాసులకొద్దీ నీళ్లు పొట్టలోపోస్తూ—మూడుమైళ్లు యింకా యిన్ని ఎలాయీడ్చుకురావడమా అనే దిగులుతో యీదురోమంటో నడుస్తూ — తేలిపోతున్న కాళ్ళతోనూ సొమ్మసిల్లుతున్న దేహాలతోనూ యిల్లుచేరుకున్నాం. దారి పొడుగునా యీ పిక్నిక్కి ప్రోత్సాహంయిచ్చినవాళ్ళందర్నీ ఆడిపోస్తూనేవున్నాడు గిరి.

* * *

గుమ్మంలో కాలుపెట్టేటప్పటికి గాండ్రుమన్నది శాంతా దేవి.

"నేను వస్తున్నానని రాస్తే స్టేషనుకిరాలేదు సరిగదా యింట్లోకూడా లేకుండావెళ్లారు. తాళంచెవులులేక నేను యీపంచనీ ఆపంచనీ పడివుండవలసివచ్చింది."

ఒక్క-క్షణం ఆగి, పట్టలేనంతకోపంతో పళ్లుకొరుకుతూ అంది. "పిక్ నిక్ ?"

యింకోక్షణంఆగి భార్యకి భర్తమీదవుండే బాధ్యతాయుత అధికారంతోఅంది. "నేను వూళ్ళోలేకపోతే మీకు మరీ విచ్చలవిడీ !"

మరోక్షణంఆగి చురచురచూస్తూఅంది "పి-క్-ని-క్"-.

(ఏప్రిల్ '40)